www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 2 ఫిబ్రవరి 2025

5

అన్నమయ్య

‘ఫీజు పోరు’ను జయప్రదం చేయండి : వైసిపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈ నెల 5వ తేదీన నిర్వహించే ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ తెలిపారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్‌పై జిల్లా కేంద్రం రాయచోటిలో పోరుబాట కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 8 నెలలు అవుతున్నా ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ కలెక్టర్ వినతి పత్రం ఇస్తామన్నారు. వైసిపి తలపెట్టిన కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా, నాయకులు పాల్ చంద్రశేఖర్, ఈశ్వర్ నాయక్, నూర్ మొహిద్దీన్ ఖాన్, యాసిన్, మహేష్ బాబు పాల్గొన్నారు.

శ్రీనివాసపురం రిజర్వాయర్‌కు నీళ్లిస్తాం

అభివాదం తెలియజేస్తున్న సిఎం

ప్రజావేదిక కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు, విభిన్న ప్రతిభావంతుడికి ట్రైసైకిల్ పంపిణీ చేస్తున్న సిఎం

కొప్పర్తి పారిశ్రామికవాడకు చేయూత
రూ.1.64 కోట్లతో శిలాఫలకం ఆవిష్కరణ
సంబేపల్లి ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజావేదికకు హాజరైన ప్రజలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/రాయచోటి

సాధ్యమైనంత తొందరగా హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులను పూర్తి చేసి, శ్రీనివాసపురం రిజర్వాయర్‌కు నీళ్లిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శనివారం అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలంలోని ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ, పేదల సేవలో పేరుతో నిర్వహించిన పింఛన్ల పంపిణీ అనంతరం ప్రజావేదిక కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన పింఛన్ లబ్ధిదారులైన కొప్పుల మంగమ్మ, గొల్లపల్లి వెంకటేశ్వర్లు ఇళ్లకు వెళ్లి యోగక్షేమాలను తెలుసుకుని రూ.4 వేలు, వికలాంగుడైన వెంకటేశ్వర్లుకు రూ.ఆరువేల ఫించన్ అందించడంతోపాటు కేంద్ర ప్రభుత్వ పథకమైన పక్కా కింద మరో నాలుగు వేలను కలిపి మంగమ్మకు రూ.ఆరు వేలు, వికలాంగుడైన వెంకటేశ్వర్లుకు రూ.10 వేలు ఇస్తామని తెలిపారు. అనంతరం పింఛనుదారుల అభ్యర్థన మేరకు ఇళ్ల స్థలం, ఇళ్ల నిర్మాణానికి హామీనిచ్చారు. అనంతరం వికలాంగుడైన వెంకటేశ్వర్లుకు ఎలక్ట్రిక్ ట్రైసైకిల్, రూ.30 వేల విలువ కలిగిన సబ్సిడీ సోలార్ విద్యుత్ సదుపాయాన్ని కలిగించారు. రూ.1.64 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ శ్రీనివాసపురం రిజర్వాయర్‌ను నింపితే 30 వేల ఎకరాలు సాగులోకి వస్తుందని తెలిపారు. రాయచోటికి శ్రీనివాసపురం ప్రాజెక్టు ద్వారా నీరు అందిస్తామన్నారు. నీరు ప్రధానం అని గుర్తించిన ప్రభుత్వం రాయలసీమలో నీటిని స్టోరేజీ చేసి రాష్ట్రంలో కోనసీమ కంటే రాయలసీమ అత్యధిక ఆధాయ వనరులు సృష్టిస్తామన్నారు. చెత్త నుండి సంపదను సృష్టించే మార్గాలను కూడా చేపడతామన్నారు. రాయలసీమలో హార్టికల్చర్, ఆంధ్రలో ఆక్వా కల్చర్, కోస్తాలో ఆయిల్ పామ్ పంటలు ఆర్థిక లాభాలకు బాటలు వేసేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. సంపదను సృష్టించే మార్గాలు తెలివి తేటలతోనే వస్తాయని, ఆ తెలివి అనేది మన పిల్లల చదువులోనే వుందన్నారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని, ఈ ప్రాంతాన్ని ఉద్యాన హబ్‌గా మార్చి రాష్ట్రంలో ప్రధాన ఆదాయ వనరుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో కూరగాయలు సాగుచేసే రైతులు అధికంగా వున్నారని తెలిపారు. ప్రతి ఏడాది పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక అనేక మంది రైతు కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి ఖచ్చితంగా మద్దతు ధరను ప్రతి పంటకు అందిస్తామన్నారు. రాయలసీమలో ఉత్పాదనలకు పుట్టినిల్లుగా మారిందని, అది మన రాయలసీమ జిల్లాల ప్రధాన ఆదాయవనరుగా మార్చుకోవాలన్నారు. కడపలోని కొప్పర్తి పారిశ్రామిక వాడకు చేయూతనిస్తామన్నారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన ఈ ఎనిమిది నెలల కాలంలో ఎప్పుడు లేని విధంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందజేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో కేవలం ఏడు నెలల్లో రూ.100 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కిషోర్‌కుమార్‌రెడ్డి, ఆరవ శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి, జయచంద్రారెడ్డి షాజహాన్‌బాషా, అన్నమయ్య డెవలప్‌మెంట్ చైర్మన్ రూపానందరెడ్డి, కలెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

సామాజిక పింఛను పంపిణీ చేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

నిరాశాజనకం

ఉక్కు పరిశ్రమ ఊసే లేదు - కిసాన్ కార్డుల పరిమితి పెంపు - వేతన జీవులకు ఉపశమనం

ప్రజాశక్తి- కడప ప్రతినిధి/కడప అర్బన్

కేంద్ర బడ్జెట్ 2025-26 తీవ్ర నిరాశను కలిగించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ 2025-26 రూ.50.65 లక్షల కోట్ల బడ్జెట్‌ను శనివారం ప్రవేశపెట్టారు. కేంద్రంలోని బిజెపి, కూటమి సర్కారు ప్రాధాన్య తలకు అనుగుణంగా పోలవరం, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రస్తావనకు మాత్రమే పరిమితమైంది. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, వెనుక బడిన ప్రాంతాలకు నిధుల ప్రస్తావన కనిపించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. రాష్ట్రంలోని కూటమి సర్కారుకు నిర్లక్ష్యానికి పూర్తిస్థాయి బడ్జెట్‌లో చోటు లభించకపోవడం గమనార్హం. జిల్లాలో కూటమికి 11 మంది ఎమ్మెల్యేలను ఇచ్చినప్పటికీ నిర్లక్ష్యం చేసింది. కిసాన్ కార్డుదారుల రుణ పరిమితి పెంపు, వేతన జీవులకు పన్ను రిబేటు సదుపాయాన్ని పెంచడం మినహా ఎటువంటి నిర్మాణాత్మక అభివృద్ధికి ఊతమివ్వని పోవడం గమనార్హం. రైల్వే బడ్జెట్‌లోనూ కడప-బెంగళూరు రైల్వేలైన్ సహ పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు ప్రస్తావన కనిపించలేదు.

కేంద్రబడ్జెట్ 2025-26 జిల్లావాసులను నిరాశపరిచింది. కేంద్రంలోని ఎన్డీయే సర్కారు పెండింగ్ ప్రాజెక్టులకు కేటాయింపు జాడే కనిపించలేదు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలైన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, గనుల కేటాయింపు, కడప-బెంగళూరు, కడప-విజయవాడ వంటి రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపుల ప్రస్తావనే కనిపించలేదు. ఉమ్మడి జిల్లాలో ఐదు లక్షల మంది రైతులకు కిసాన్‌కార్డుల రుణ పరిమితిని రూ.మూడు లక్షల నుంచి రూ.ఐదు లక్షలు, ఎంఎస్‌ఎంఇలకు రూ.10 లక్షల వరకు పెంచింది. వేతన జీవుల ఆదాయ పన్ను శ్లాబుల్లో రూ.7.5 లక్షల పన్ను రిబేటును రూ.12.75 లక్షల పెంచడం స్వల్ప ఉపశమనం కలిగించింది. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని 32 వేల మంది ఉద్యోగుల్లో, 22,800 మంది లబ్ధి చేకూరనుంది. రాష్ట్ర విభజన జరిగిన పదేళ్లకు టిడిపి ఎంపీల మద్దతు అవసరమైన నేపథ్యంలో గుడ్డిలో మెల్ల చందంగా వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల ప్రస్తావన మరిచింది. విశాఖ-చెన్నయ్ కారిడార్‌లో భాగంగా జిల్లా కేంద్రానికి సమీపంలోని కొప్పర్తి పారిశ్రామిక వాడకు నీళ్లు, విద్యుత్, రోడ్లు, హైవే ఏర్పాటు ప్రస్తావనే లేదు. జిల్లాలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టులైన కడప-బెంగళూరు, కడప - విజయవాడ, ఓబుల వారిపల్లి - కృష్ణపట్నం సివిల్ రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపుల ప్రస్తావనే కనిపించలేదు.

ఆశించిన ఊరట లేదు

కేంద్ర బడ్జెట్‌లో సామాన్య ప్రజలకు, రైతులకు, కూలీ వర్గాలకు, మధ్య తరగతి ప్రజలకు ఆశించిన ఊరట అందలేదు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే విధంగా, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ఈ బడ్జెట్ రూపొందించలేదు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, రైతులకు మద్దతు ధరలు పెంచేలా, ఉపాధి అవకాశాలు సృష్టించేలా, సామాజిక న్యాయాన్ని పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలి

- ఎన్.డి.విజయ జ్యోతి, డిసిసి అధ్యక్షులు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకమైంది. కార్పొరేట్ అనుకూల నిర్ణయాలతో ఆర్థికంగా చిన్నాభిన్నం అయింది కేంద్రమంత్రి సంస్కరణలు కొనసాగిస్తామని, సంస్కరణల అమలుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించడం దారుణం. ప్రభుత్వ రంగాన్ని బలహీనపరిచే చర్యల్ని మోడీ ప్రభుత్వం కొనసాగిస్తూనే ఉంది.

- జి.చంద్రశేఖర్, సిపిఎం, జిల్లా కార్యదర్శి.

ఎన్నికల బడ్జెట్‌గా మార్చింది

బడ్జెట్‌లో విభజన హామీల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా అమలు చేయలేకపోయారు. బిజెపి ఎన్నికల బడ్జెట్‌గా మార్చింది. కనీసం కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, వెనకబడిన జిల్లాల అభివృద్ధి ప్యాకేజీ పై కూడా బడ్జెట్లో ప్రస్తావన లేకపోవడం విచారకరం.

- గాలి చంద్ర, సిపిఐ జిల్లా కార్యదర్శి

ఎపికి మళ్లీ అన్యాయం

కేంద్ర బడ్జెట్‌లో ఈ సారి కూడా బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసింది. రాష్ట్రానికి సంజీవిని లాంటి ప్రత్యేక హోదా అమలు చేస్తామని బడ్జెట్‌లో పేర్కొనలేదు. విభజన చట్టంలో 13 వ షెడ్యూల్ ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరగాలి కాని వాటి గురించి గురించి బడ్జెట్ లో ప్రస్తావించలేదు. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఉండి కూడా రాష్ట్రానికి ఇంత అన్యాయం జరిగింది.

- ఎన్. తులసిరెడ్డి, పిసిసి అధికార ప్రతినిధి.

బీమా రంగంలో ఎఫ్‌డిఐ నష్టదాయకం

ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించిన మేరకు బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పరిమితిని 74 శాతం నుంచి 100 శాతానికి పెంచడం వల్ల బీమారంగానికి, పాలసీదారులకు మేలు చేయదు. వంద శాతం ఎఫ్‌డిఐ అంటే అంటే అర్థం – స్వదేశీ భాగస్వామి కంపెనీ లేకుండానే ఒక విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీ భారత దేశంలో నేరుగా ఏర్పాటు కావడమే.

- ఎ.రఘునాథరెడ్డి, ఎల్‌ఐసి యూనియన్ నాయకులు, కడప.

ఉద్యోగులకు భారీ ఊరట

ఆర్థిక బడ్జెట్‌లో రూ.12 లక్షలు ఆదాయం వరకు ఎటువంటి పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదు. స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేల కలుపుకొని రూ.12.75 లక్షల వరకు ఆదాయపన్ను లేకపోవడం వల్ల వేతన జీవులకు భారీ ఊరట లభించింది.

- జమాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు, ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం

ట్రిపుల్‌ఐటిలకు నిధుల కొరత

రూ.300 కోట్లకు ప్రతిపాదనలు
660 రెగ్యులర్ పోస్టులు భర్తీకి ప్రణాళిక
ఆర్‌జెయుకెటి వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి-వేంపల్లె

రాష్ట్రంలో రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ పరిధి లోని నాలుగు ట్రిపుల్‌ఐటిలకు నిధులు అంతంత మాత్రంగానే ఉన్నాయని ఆర్‌జెయుకెటి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్‌ఐటిలు నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళంలోని ట్రిపుల్‌ఐటిలకు నూతన భవనాలు, ఇన్‌ఫ్రాస్టక్చర్, కంప్యూటర్లు, మౌలిక వసతులు, తదితర వాటికి రూ.300 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. గతంలో రూ.100 కోట్లు అడగగా రూ.50 కోట్లు జీతాలకే సరిపోయిందన్నారు. ప్రస్తుతానికి ఒంగోలు ట్రిపుల్‌ఐటికి సంబంధించి నూతన భవనాలు రూ.200 కోట్లు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటికి సంబంధించి రూ.50 కోట్లు, ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ, ఒంగోలు ట్రిపుల్‌ఐటిలకు సంబంధించి రూ.50 కోట్లు అవసరం ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం పియుసి, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించి 660 రెగ్యులర్ పోస్టులను భర్తీ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. అయితే కొందరు కోర్టుకు పోవడంతో పోస్టుల భర్తీ ఆగిపోయిందని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కోర్టు కేసులను క్లియర్ చేసిన తర్వాతనే రీ-నోటిఫికేషన్ ను ఇచ్చి పోస్టులు భర్తీ చేయాలని ప్రణాళిక రూపొందించనుందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ నిధులు అంతంత మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంట్రాక్టు పద్ధతుల పనిచేస్తున్న అధ్యాపకులకు మినిమం టైం స్కేల్‌ను అందించాలని విలేకరులు అడగగా ఈ విషయంపై తమ చేతుల్లో లేదని ప్రభుత్వ మే నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ట్రిపుల్‌ఐటిలలో కొత్తగా ఎఐఎంఎల్ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ మిషన్ లర్నింగ్) కోర్సును ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అయితే ఈ కోర్సుకు సంబంధించి గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. అనంతరం ట్రిపుల్‌ఐటిలలో చదువుతున్న విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడకుండా సైకాలజిస్టలను పిలిపించి విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని డైరెక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌జెయుకెటి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ సండ్ర, డైరెక్టర్లు ప్రొఫెసర్ కుమారస్వామి గుప్తా, ప్రొఫెసర్ బాలాజీ, ప్రొఫెసర్ భాస్కర్ పటేల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌జెయుకెటి వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్

విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఇఒలు

ఆకట్టుకున్న భువన ఉత్సవం 2కె25

ప్రజాశక్తి-పీలేరు

2కె25 భువన ఉత్సవం అతిథులను, ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది. శనివారం పీలేరు చిత్తూరు మార్గంలోని శ్రీభువన విద్యాలయంలో ఆ సంస్థ నిర్వహించిన 15వ వార్షికోత్సవ కార్యక్రమానికి పీలేరు మండల విద్యాశాఖ అధికారులు వై.లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేదికపై గుంటూరు రుబిక్స్ అకాడమీ సిఇఒ రమ్య విద్యార్థులు చేత చేయించిన అబాకస్ లెక్కలు, వేదిక్ మ్యాథ్స్ ప్రశ్నలు, వాటి జవాబులు ప్రతి ఒక్కరిని ఆశ్చర్యానికిలోను చేశాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు కూడా అందరినీ ఆకట్టుకున్నాయి. పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఇఒలు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఇఒ లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యా సంస్థ అభివృద్ధికి కరస్పాండెంట్ ఉమా రమాదేవి, ప్రిన్సిపల్ గుణ లక్ష్మి చేస్తున్న కృషిని అభినందించారు. ముందుగా చిన్మయ మిషన్ స్వామీజీ కృష్ణానంద సరస్వతి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యా సంస్థ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అతివేగం అనర్థదాయకం : ఆర్‌టిఒ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అతివేగం అనర్థ దాయకమని మితవేగం ఆనందదాయకమని మదనపల్లె ఆర్‌టిఒ అశోక్ ప్రతాప్‌రావు అన్నారు. 36వ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని శనివారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య జీవితంలో క్రమశిక్షణ నేర్పిస్తుందని, అదే క్రమశిక్షణతో రోడ్డు నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. అనంతరం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, మితిమీరిన వేగం వల్లే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాటిని అరికట్టడం మనచేతుల్లోనే ఉందని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారులో ప్రయానించేటప్పుడు సీటు బెల్టు తప్పక పెట్టుకోవాలని తెలియజేసారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.కృష్ణవేణి మాట్లాడుతూ రోడ్డు భద్రతను సామాజిక బాధ్యతగా యువత గుర్తించి నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు సూర్యశేఖర్ రెడ్డి, మోహనవల్లి, విష్ణుప్రియ, హాజీరా, జ్యోతి, వనజ, ఖాజావలి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై మాట్లాడుతున్న ఆర్‌టిఒ

రహదారుల మరమ్మతు పనులు పూర్తి

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బి.సి.జనార్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో గుంతల రహిత రహదారులే లక్ష్యంగా చేపట్టిన రోడ్ల మరమ్మతు పనులు 88 శాతం పూర్తి కావడంపై రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. శనివారం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రాయచోటి నియోజకవర్గానికి మంత్రి విచ్చేశారు రాయచోటిలోని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నివాసంలో కడప, అన్నమయ్య జిల్లా ఆర్‌అండ్‌బి శాఖ ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లాలో జరుగుతున్న రోడ్ల అభివృద్ధి పనులపై మంత్రి ఆరా తీశారు. గుంతల రహిత రహదారులే లక్ష్యంగా అన్నమయ్య జిల్లాలో రూ. 14.65 కోట్లతో చేపట్టిన 1443 కి.మీ గాను 1272 కి.మీ మేర రోడ్ల మరమ్మతు పనులను ఇప్పటివరకు పూర్తి చేశామన్నారు. అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మొత్తంగా ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 88 శాతం రోడ్లను గుంతల రహితంగా తీర్చిదిద్దామని వివరించారు. మిగిలిన 171 కి.మీ రోడ్ల మరమ్మతు పనులను ఫిబ్రవరి తొలి వారంలో పూర్తి చేస్తామని వారు తెలిపారు. జిల్లాలో రూ. 1.52 కోట్లతో చేపట్టిన జంగిల్ క్లియరెన్స్ పనులుకు సంబంధించి 1573 కి.మీ గాను ఇప్పటి వరకు 1300 కి.మీ పూర్తి చేశామన్నారు. మిగిలిన 272 కి.మీ జంగిల్ క్లియరెన్స్ పనులను ఫిబ్రవరి తొలి వారానికి పూర్తి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో కడప ఆర్‌అండ్‌బి శాఖ ఎస్‌ఇ జి.చంద్రశేఖర్, రాజంపేట ఆర్ అండ్ బి ఇంజినీర్ సహదేవరెడ్డి, మదనపల్లి ఇఇ అరవింద పాల్గొన్నారు.

అధికార పార్టీ నాయకుడి దౌర్జన్యంపై నిరసన

ప్రజాశక్తి-వాల్మీకిపురం

దశాబ్దకాలం నుండి రాకపోకలు సాగిస్తున్న రోడ్డును అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నాడని బాధిత ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక మదనపల్లి-తిరుపతి రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ పట్టణంలోని తిరుపతి రోడ్డుకు ఆనుకొని ఉన్న చాకలబండవీధికి దశాబ్దకాలంగా మట్టి రోడ్డు ఉందని తెలిపారు. ఇక్కడ దాదాపు 60 కుటుంబాలు జీవనం సాగిస్తున్నామన్నారు. తామంతా పెద్దల కాలం నుంచి ఇదే రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నామన్నారు. తమ ఇండ్లకు వెళ్లేందుకు ఈ రోడ్డు తప్ప వేరే దారి లేదని కన్నీటిపర్యంతమయ్యారు. ప్రస్తుతం ఇదే ప్రాంతంలో ఉంటున్న ఓ అధికార పార్టీ నాయకుడు ఈ రోడ్డు మొత్తం తమ పట్టా భూమిలో ఉందంటూ దౌర్జన్యం చేస్తున్నాడని, దశాబ్దకాలంగా పట్టా భూమిలో లేని రోడ్డు ఇప్పుడు ఏ విధంగా వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. ఈ రోడ్డు నుంచి ఎవరికీ ప్రవేశం లేదని అడ్డుకుంటుండడంతో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. దీంతో వాహనాలు రోడ్లపై నిలిచిపోవడంతో పోలీసులు బాధిత ప్రజలకు నచ్చచెప్పి సోమవారం వరకు వేచి ఉండాలని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో ధర్నాను విరమించారు. అనంతరం బాధితులు రోడ్డు సమస్యపై జిల్లా కలెక్టర్, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో చాకలబండవీధి ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న చాకలబండవీధి ప్రజలు

ఎంఇఒను సన్మానిస్తున్న మానవత సంస్థ సభ్యులు

ఎంఇఒకు ఘన సన్మానం

ప్రజాశక్తి-పీలేరు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టరు నుంచి ఉత్తమ మండల విద్యాశాఖ అధికారిగా అవార్డు అందుకున్న ఎంఇఒ వై.లోకేశ్వరరెడ్డిని మానవత సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శనివారం స్థానిక ఎంఆర్‌సిలో నిర్వహించిన కార్యక్రమంలో మానవత ప్రతినిధులు మాట్లాడుతూ పిల్లల విద్యాభివృద్ధిలో మండలాన్ని జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలని ఎంఇఒ చేస్తున్న కృషిని కొనియాడారు. అవార్డు గ్రహీత మాట్లాడుతూ తన సేవలను గుర్తించి తనను సన్మానించడం పట్ల మానవతా సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంఇఒ తమ పూర్వ ఉపాధ్యాయులైన షేక్ ఇమామ్ సాహెబ్‌ను గుర్తుకు చేసుకుంటూ ఆయన పేరు మీద మానవత సంస్థకు రూ.10 వేలు విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ వంగి మల్ల రామచంద్ర, అధ్యక్షులు శెట్టి సుబ్రహ్మణ్యం, కోచైర్మన్ రాచపల్లి కృష్ణమూర్తి, పోతంశెట్టి రమేష్, రహత్‌బాష, సుధాకర బాబు, రాయ ఆనంద, పోస్ట్మెన్ జివి రమణ, మానవత సభ్యులు, సిఆర్‌పిలు జలకనూరి మురళీధర్ రాజు, రెడ్డప్ప, సిద్దప్ప, జయపాలరెడ్డి, కృపాల్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాగృతి

ప్రజా'దృష్టి'

జిల్లాలోని ఇటీవలి పరిణామాలు ప్రజలను చైతన్యం కలిగించాయి. ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటి, రెండు, మూడు తేదీల్లో నెల్లూరు జిల్లాలో నిర్వహించనున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభల సందర్భంగా రెండ్రోజులపాటు సిపిఎం చేపట్టిన జీపుజాతా ప్రజలను ఆలోచింపజేసింది. కడప జిల్లాలో ఉక్కుపరి శ్రమను ఏర్పాటు చేయాలని, జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలని, ఉపాధి హామీ పథకాన్ని పట్టణ పేదలను వర్తింపజేయాలని కోరుతూ సాగిన జీపుజాతా సరైన సమయంలో సరైన దిశగానే సాగిందనే చెప్పాలి. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తే గల్ఫ్ సహ బెంగళూరు, చెన్నయ్, హైదరాబాద్ మహా నగరాలకు వెళ్లే వలసల్ని నివారించొచ్చని ఉద్ఘాటిం చడం గమనార్హం. విశాఖ ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసిన ప్రదేశానికి ప్రపంచంలోనే సరైన గుర్తింపు లభించడం, రాష్ట్రంలోనే తలసరి ఆదాయం పెరిగిన ప్రదేశంగా గుర్తింపు పొందిన సందేశాన్ని వినిపిస్తూ కడప ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదాన్ని ఇంటింటికీ చేర్చాలని పిలుపునివ్వడం యువతను ఆకట్టుకుందనే చెప్పాలి. మోడీ నాయకత్వంలోని ఎన్డీయే సర్కారు రాష్ట్రంలోని కూటమి పార్టీలైన టిడిపి, జనసేనపై ఆధారపడి సాగుతున్న నేపథ్యాన్ని గుర్తు చేయడం ద్వారా బృహత్తరమైన బాధ్యతను గుర్తు చేసింది. కేంద్ర, రాష్ర ప్రభుత్వాలు బడ్జెట్లను ప్రవేశపెడుతున్న తరుణంలో వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయింపులు చేయాలనే ఒత్తిడిని పెంచే ప్రయత్నం చేయడం సమంజసంగానే ఉందని చెప్పవచ్చు. శనివారం నాటి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటు తీసుకురావడం, కడప-బెంగళూరు రైల్వే లైన్ సహా మిగిలిన రైల్వేలైన్లకు తగిన కేటాయింపులు చేయాల్సి ఉంది. కేంద్రంలోని ఎన్డీయే సర్కారు రాష్ట్రానికి తగిన కేటాయింపులు చేయకపోతే కూటమి పార్టీలే బాధ్యత వహించేలా చేయడంలో కృత కృత్యులైనట్లు కనిపిస్తోంది. మరో వామపక్ష రాష్ట్ర నాయకులు జిల్లాలోని పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నా చర్చనీయాంశం చేసింది. ఎగిసి పడిన ప్రజాఉద్యమానికి రాష్ట్ర ప్రభుత్వం తలవంచి ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేని పేదల కోసం స్థల సేకరణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు కనిపిస్తోంది. జిల్లా అధికార యంత్రాంగం ఏమేరకు స్థలాన్ని సేకరిస్తుంది, ఏమేరకు ఆచరణలోకి తీసుకు వస్తుందో వేచి చూడాల్సి ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పాఠశాల చుట్టూ ఏర్పాటు చేసిన కంచె

దాతల సహకారంతో కంచె ఏర్పాటు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి పంచాయతీ కృష్ణంపల్లి ప్రాథమిక పాఠశాలకు దాతల సహకారంతో రూ.50వేలు ఖర్చుపెట్టి కంచె ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సివి రమణమూర్తి పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం గ్రామస్తులు ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. పాఠశాలకు ఎలాంటి సహకారం కావాలన్నా గ్రామస్తుల తోడ్పాటు ఉంటుందని పేర్కొన్నారు. గ్రామస్తుల సహకారం ఉంటే ప్రతి కార్యక్రమాన్ని కూడా విజయవంతంగా పూర్తి చేస్తామని చెప్పారు. సహకారం అందించిన దాతలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నారే చలపతి, కృష్ణ కుమార్, విశ్వనాథ్, బాలిపోగు శివకృష్ణ, ఆకేపాటి మురళి, పాఠశాల చైర్మన్ పసుపులేటి రవి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లుల చెల్లింపులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విద్యుత్ వినియోగదారులు క్యూఆర్ కోడ్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునని విద్యుత్ శాఖ ఎడి భాస్కరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు సులభతరంగా విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు విద్యుత్‌శాఖ వారు వినియోగదారులకు ఇచ్చే బిల్లులోనే క్యూఆర్ కోడ్ ఉంటుందని తెలిపారు. యుపిఐ యాప్స్ ద్వారా స్కాన్ చేసి సులభంగా బిల్లులు చెల్లించవచ్చునని అన్నారు. బిల్లులు చెల్లించే సమయంలో బిల్లులోని అమౌంట్ యుపిఐ యాప్‌లో చూపిస్తున్న అమౌంట్ సమానంగా ఉండాలని, విద్యుత్ బిల్లు ఇచ్చిన 15 రోజులలోగా బిల్లు చెల్లించినట్లయితే ఎలాంటి సర్‌చార్జి, లేట్ ఫీ ఉండవని తెలిపారు.

క్యాబినెట్ డైరెక్టర్‌గా 'మన్నెం'

ప్రజాశక్తి-నందలూరు

మన్నెం రామ్మోహన్

కుర్ర మణి యాదవ్

వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-302 క్యాబినెట్ డైరెక్టర్లుగా మన్నెం రామ్మోహన్, కుర్ర మణి యాదవ్‌ను ఎంపిక చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ (రాయల సీమ, కర్ణాటక, తమిళ నాడు, కేరళ, అండమాన్ పుదుచ్చేరి)డిస్ట్రిక్ట్ -302 క్లబ్ 2025 సంవత్సరం నూతన కార్యవర్గం క్యాబినెట్ సమావేశం శనివారం పుత్తూరు వాకర్స్ భవన్‌లో జరిగినది. ఈ సందర్భంగా డైరెక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ 2025 సంవత్సరం నకు వాకర్స్ నూతన గవర్నర్‌గా ఆర్. మాధవ నాయుడు ప్రమాణ స్వీకారం చేశారని తెలిపారు. నందలూరు వాకర్స్ క్లబ్ నుంచి జరుగుతున్న సేవలను గుర్తించి, శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్, వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రస్ట్ బోర్డ్ మెంబర్ కొండూరు శరత్ కుమార్ రాజు ప్రోత్సాహంతో వాకర్స్ ఇంటర్నేషనల్ క్యాబినెట్‌లో నందలూరు వాకర్లను డైరెక్టర్లుగా ఎంపిక చేయటం జరిగిందని అన్నారు. వాకర్స్ క్లబ్ పరంగా నందలూరులో మరిన్నీ సేవలు విస్తరించడానికి తమ వంతు ప్రయత్నం చేస్తామని తెలిపారు. సేవలను గుర్తించి క్యాబినెట్‌లో డైరెక్టర్లుగా ఎంపిచేసిన వాకర్స్ గవర్నర్ మాధవ నాయుడు, కొండూరు శరత్ కుమార్ రాజుకు ధన్యవాదములు తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా జన్మదిన వేడుకలను టిడిపి నాయకులు, అభి మానులు, కార్యకర్తలు ఘనంగానిర్వహించారు. ఉదయం నుంచి పలుచోట్ల టిడిపి శ్రేణులు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నీరుగట్టువారిపల్లె మార్కెట్ యార్డ్ ఎదుట జహా యువసేన నాయకులు రెడ్డిరాయల్, రాటకొండ శ్రీనివాసులు, చలపతి, శివనాయక్, బొమ్మిశెట్టి పురుషోత్తం ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలు పలువురిని ఆకట్టుకున్నాయి. కేక్ కోసిన తర్వాత వెయ్యిమందికి పైగా అన్నదానం చేశారు. తన మీద ఇంతటి అభిమానం చూపించిన తమ్ముళ్లలాంటి కార్యకర్తలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే అన్నారు. **నిమ్మనపల్లి :** నిమ్మనపల్లిలో టిడిపి మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ, మాజీ మండల అధ్యక్షులు రాజన్న, రాజంపేట పార్లమెంటరి టిడిపి అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్, మాజీ జడ్‌పిటిసి రెడ్డప్పరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నిమ్మనపల్లి బస్టాండ్ కూడలిలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో శ్రీపతి, సుధాకర, మల్లప్ప, జగదీశ్, రఫీ, ప్రదీప్ సింగ్, ఖాసీం ఖాన్, షఫీ, జయన్న, రమణ, శ్రీనివాసులు రెడ్డి, ఓబుల్ రెడ్డి, రెడ్డెప్ప టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటల పోటీలకు రూ.10 వేలు వితరణ

వేంపల్లె - వేంపల్లె

పాఠశాల స్థాయిలో జరిగే ఆటల పోటీలకు టిడిపి యవనేత సింగారెడ్డి రజనీకాంత్ రెడ్డి (సూరి) రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. శనివారం బాలుర పాఠశాల హెచ్‌ఎం శివ మునెమ్మకు నగదు దాత అందజేశారు. తలిశెట్టి సుబ్రహ్మణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 77వ వార్షికోత్సవ సందర్భంగా పాఠశాల స్థాయిలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసేందుకు ఆయన ఆర్థికసాయం చేయడం సంతోషకరమని హెచ్‌ఎం శివ మునెమ్మ తెలి పారు. దాతృత్వం అనేది విద్యార్థులు మరవరాదన్నారు. బాలుర పాఠశాలలో చదివిన రజనీకాంత్‌రెడ్డి విద్యార్థుల కోసం ముందుకు రావడం అభినం దనీయమన్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధి, విద్యా ప్రగతి, క్రీడా భివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. రజనీకాంత్‌రెడ్డిని ఆదర్శంగా తీసు కోవాలని పాఠశాల కమిటీ చైర్మన్ బుజ్జి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధర్మారెడ్డి పాల్గొన్నారు.

అభిషేక్‌రెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

గత నెల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్ అభిషేక్‌రెడ్డి కుటుంబ సభ్యులను శనివారం వైవి సుబ్బారెడ్డి పరామర్శించారు. పట్టణంలోని అభిషేక్ నివాసానికి వెళ్లి ఆయన తండ్రి వైఎస్ మధుసూదన్ రెడ్డి, తాత ప్రకాష్‌రెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ అభిషేక్‌రెడ్డి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని వైఎస్ జగన్, వైఎస్ అవినాష్‌రెడ్డి విజయానికి ఎంతగాలో తోడ్పడ్డారన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించొచ్చని ఎస్ఐ నారాయణ తెలిపారు. స్థానిక పాత బస్టాండ్ వెంకటేశ్వర స్వామి గుడి సమీపంలో శనివారం సాయంత్రం ఎస్ఐ వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా లైసెన్స్‌లేని వాహనాలకు, ట్రిపుల్ రైడింగ్ చేసేవారికి జరిమానా విధించామన్నారు. ముఖ్యంగా పట్టణంలో చాలామంది లైసెన్స్ లేని వారు ట్రిపుల్ రైడింగ్ చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు.

'ఉక్కు'పై గట్టిగా పోరాడుదాం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి మనమంతా గట్టిగా పోరాడుదామని ఎపి పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారని నియోజకవర్గ కో-కన్వీనర్ సింగం శివమోహన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోటస్ పాండ్‌లో తాను షర్మిలను శనివారం మర్యాదపూర్వకంగా కలిశానని తెలిపారు. ఈ సందర్భంగా శివమోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా, జమ్మలమడుగు నియోజగవర్గ ప్రజల సమస్యలను అడిగి తెలిపారు.

రోడ్లు గుంతలమయం.. మరమ్మతులు నాసిరకం

ప్రయాణికులకు తప్పని తిప్పలు
నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ప్రజల వేడుకోలు

ఉప్పరపల్లి సమీపంలోని గుంతల రహదారి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంల ప్రధాన రహదారిలో రోడ్డు మరమ్మతు పనులు కంటి తుడుపు చర్యగా చేపట్టారని ప్రజలు పెదవి విరిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్రాంతి పండుగలోగా రహదారి మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారని, కానీ ఆచరణ మాత్రం శూన్యంగా కనిపిస్తోందన్నారు. సంక్రాంతి పండుగ అనం తరం రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. కోడూరు పట్టణం నుంచి ఎస్.ఉప్పరపల్లె సమీపం వరకు మాత్రమే మరమ్మతులు అరకొరగా చేపట్టారన్నారు. మధ్య మధ్యలోనూ కొన్ని ప్రాంతాలలో మరమ్మతులు చేపట్టకుండా అలాగే వదిలేశారన్నారు. ఉప్పరపల్లె సమీపంలో రోడ్డు గుంతలమయంగానే ఉందని, మరమ్మతులు నాసిరకంగా చేపట్టి చేతులు దులుపుకున్నారని అన్నారు. వాహనాలు వెళ్లే సమయంలో కుదుపులకు గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు విమర్శిస్తున్నారు. కోడూరు నుంచి రేణిగుంట వరకు చాలావరకు మరమ్మతులు చేపట్టకపోవడం బాధా కరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు మరమ్మతు పనులను సక్రమంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

నాసిరకంగా చేపట్టిన రోడ్డు మరమ్మతులు

రిలే దీక్షకు ఎస్‌ఎఫ్‌ఐ మద్దతు

రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్ సబ్ స్టాఫ్ రిలే నిరాహార దీక్షలకు ఎస్‌ఎఫ్‌ఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా కమిటీ సభ్యులు పవన్ కుమార్ తెలిపారు. శనివారం దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. అనంతరం పవన్ మాట్లాడుతూ పాఠశాల కాంట్రాక్టర్ కనీస ప్రమాణాలు పాటించని వారిపై విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తగా వచ్చిన ఉషోదయ ఎడ్యుకేషన్ అకాడమీ కాంట్రాక్టర్ అక్కడ పనిచేస్తున్న నిర్వాసిత సబ్ స్టాఫ్ కార్మికులు పనిచేయించుకొని మూడు నెలల జీతం ఎగ్గొట్టి జీతం అడిగితే విధులకు రావద్దని నోటి మాటతో బయటకు గెంటేయడం దుర్మార్గమన్నారు. తొలగించిన ఉద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసు కోవాలని లేకుంటే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నిబం ధనల ప్రకారం పాఠశాలను నిర్వహించడం లేదని, 30 మంది కూర్చోవాల్సిన పాఠశాల గదులు 50 మందికి పైగా కూర్చుంటున్నారని అన్నారు. కనీసం అగ్ని ప్రమాదం సంభవిస్తే ఫైర్ గన్‌లు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. మురుగు కాలువలన దోమలు విపరీతంగా పెరిగి విద్యార్థులకు జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారని, ఉచితంగా ఇవ్వాల్సిన బుక్స్‌కు ఆరు, ఏడు వేల రూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు. ఏడాదికి మూడు కోట్లకు పైగా సిఎస్‌ఆర్ నిధులు ఎపిఎండిసి యాజమాన్యం ఇస్తుంటే మరి పిల్లల తల్లిదండ్రుల దగ్గర డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారో యాజమాన్యం చెప్పాలన్నారు. స్కూల్ బస్సులో 30 మంది విద్యార్థులు కూర్చోవాల్సిన చోట 50 మంది విద్యార్థులను ఎక్కిస్తున్నారని బండి కండిషన్ పై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పిల్లలకి ఏమైనా ప్రమాదం సంభవిస్తే ఎపిఎండిసి యాజమాన్యం బాధ్యత వహించాలని హెచ్చరించారు. అక్రమ పద్ధతిలో టెండర్ లేకుండా అధికార పార్టీ పలుకుబడి ఉపయోగించి తెలంగాణ నేతకు కాంట్రాక్టు కట్టబెట్టడం సరికా దన్నారు. మొదటి మూడు నెలలు చెప్పి తర్వాత ఆరు నెలలకు పెంచారని కనీస ప్రమాణాలు పాటించని కాం ట్రాక్ట్‌ను రద్దు చేయాలని పేర్కొన్నారు. మధ్యాహ్నం భోజనం పై విచారించడానికి ఎస్ ఎఫ్ఐ బృందం వస్తే హెచ్‌ఎం రేవతి అనుమతి లేదని గేట్లు వేసి అడ్డుకోవడం సరికాదన్నారు. ఇది వారి సొంత పాఠ శాల కాదని ప్రభుత్వ నిధులతో నడుస్తున్నదని పేర్కొన్నారు. తక్షణమే కలెక్టర్, డిఇఒ జోక్యం చేసు కొని సమస్యలపై విచారించాలన్నారు. కార్యక్రమంలో విజయనాయక్, ఉపేంద్ర, సురేష్, అనిల్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : 'దాసరిపల్లి'

ప్రజాశక్తి-ములకలచెరువు

వెనుకబడిన తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ములకలచెరువు, ఉమా శంకర్ కాలనీ, బురకాల కోట గ్రామాల్లో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో 4వేల పెన్షన్, మూడు సిలిండర్ల ఉచిత గ్యాస్, సిసి రోడ్లు, తారురోడ్లు నిర్మాణాలు, గోకుల నిర్మాణాలు, అన్న క్యాంటీన్లు, మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఇలా అభివృద్ధి పనులుతో ప్రజలు స్వాగతిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి మాట నిలుపుకుంటామని ధీమాగా చెప్పారు. కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి, గుత్తికొండ త్యాగరాజు, రాజంపేట పార్లమెంట్ కార్యదర్శి ఎర్రగుడి సురేష్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కె.వి.రమణ, బిజెపి గోపాల్ రెడ్డి, గోపాల్ రాజు, పజులు కట్ట హరి, నీలకంఠారెడ్డి, పాస్టర్ సీనా పాల్గొన్నారు.

వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న జయచంద్రారెడ్డి

మార్కింగ్ వేసి ఆరేళ్లయినా..

ముందుకు సాగని పనులు

- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- సమస్యను పరిష్కరించాలని ప్రజల వినతి

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడు నుంచి దానంరెడ్డిగారిపల్లి వెళ్లే ఆర్అండ్‌బి స్థలం ఆక్రమణ గురై ఉండడంతో అధికారులు 2019, నవంబర్ 8న రహదారిని సర్వే చేసి మార్కింగ్ ఇచ్చారు. .పెద్దూరుకస్పా నుంచి కుషావతి నది వరకు మార్కింగ్ అలానే ఉంది. రోడ్డుపై రెండు వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు..వచ్చే పరిస్థితి లేదని వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై బస్సు పోతుంటే తిరిగి రావడానికి ద్విచక్ర వాహనం కూడా రాలేని పరిస్థితి ఉందన్నారు. సర్వే చేసి హద్దులు వేసి ఆరు సంవత్సరాలు అవుతున్నా ఆర్అండ్‌బి అధికారులు, రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు చొరవ చూపడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇటీవల గేటు ప్రాంతంలో మాత్రం ఒకవైపు మాత్రమే ఆక్రమణలను తొలగించారని అన్నారు. నూలివీడు బస్టాండ్ ఆవరణలో కూడా మార్కింగ్ వేసినా అలాగే ఉండిపోయిందన్నారు. ఆర్ అండ్ బి అధికారులు చొరవ తీసుకొని గ్రామ పంచాయతీ వారి ద్వారా సకాలంలో ఈ పనులు జరిగి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని ప్రజలు , వాహనదారులు కోరుతున్నారు.

అధికారులు సర్వే చేసి వదిలేసిన పెద్దూరు-దానంరెడ్డిగారిపల్లి రహదారి

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందిస్తున్న వరప్రసాద్

ప్రజాశక్తి-నందలూరు

పదవ తరగతి విద్యార్థులకు ప్రోత్సాహం కోసం విశ్రాంత ఉపాధ్యాయులు పుల్లయ్య కుమారుడు వరప్రసాద్ పరీక్ష సామగ్రిని టంగుటూరు జడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తరగతి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొని పరీక్షలకు సన్నద్ధమయ్యే విషయాలను వివరించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ పదవ తరగతి మీ జీవితానికి మలుపని అన్నారు. విద్యార్థులందరూ మంచి మార్కులు సాధించి మీ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు సంపాదించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ మీ జీవితాంతం ఒక్క వాక్యాన్ని గుర్తుంచుకోవాలని సియుపి గెలవడానికి, సియుపి అంటే సి ఫర్ కాన్సెప్ట్, యు ఫర్ అండర్ స్టాండింగ్, పి ఫర్ ప్రాక్టీస్. మీ కెరీర్‌ను సాధించడానికి, ఈ కప్ నియమాన్ని మరచిపోవద్దని అన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మస్తానయ్య, రమేష్ బాబు, గణేష్ బాబు. శశికల, లక్ష్మి దేవి, రేబియా బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెలో మహిళా కానిస్టేబుల్ శనివారం ఆత్మహత్య చేసుకుంది. రెండో పట్టణ సిఐ కథనం మేరకు.. నిమ్మనపల్లె రోడ్డు, విద్యోదయ స్కూల్ సమీపంలో నివాసముంటున్న రెడ్డిరోజా(35) కలికిరి మండలం పారపట్లలో మహిళాకానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. లక్ష్మి రవికుమార్‌తో 15 ఏళ్లక్రితం వివాహమైంది. కాగా పిల్లలు పుట్టలేదని తీవ్ర మనస్థాపానికి గురై సొంత ఇంట్లోనే రెడ్డిరోజా శనివారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కిందకు దింపి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు సిఐ రామచంద్ర, ఎఎస్ఐ రమణ ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆత్మహత్యకు గల కారణాలను ఆరా తీశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మహిళా కానిస్టేబుల్ మృతితో ఆమె కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసు సిబ్బంది సానుభూతి వ్యక్తం చేశారు.

రెడ్డిరోజా మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎఎస్ఐ రమణ

ఆర్థిక సాయం అందిస్తున్న యంగ్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు

ఆలయ పునర్నిర్మాణానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పిటిఎం మండలం, బూర్లపల్లి పంచాయతీ, బూర్లపల్లిలో శ్రీకోదండ రామాలయం పుననిర్మాణ పనులు గ్రామస్తులు చేపట్టారు. గ్రామస్తులు యంగ్ ఇండియా ఫౌండేషన్ వారిని సంప్రదించారు. శనివారం బూర్లపల్లి సర్పంచ్ బుచ్చిగారి సుబ్బిరెడ్డి, గ్రామస్తులు ఎన్.కృష్ణారెడ్డి శ్రీకాంత్ రెడ్డి, ఎన్.బయ్యారెడ్డి, వెంకటరామయ్య, చలపతి సమక్షంలో యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ తరుపున తమవంతుగా దేవస్థానం నిర్మాణం కొరకు రూ.5వేలు ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాజశేఖర్, రెడ్డిబాషా, శ్రీనివాసులు, అనిల్ పాల్గొన్నారు.

బిసి రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-పుల్లంపేట

చంద్రన్న స్వయం ఉపాధి పథకంలో భాగంగా బిసి కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందేం దుకు అర్హులైన బిసిలు దరఖాస్తు చేసుకోవాలని ఓబుల్‌వారిపల్లి ఎంపిడిఒ మల్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 నుంచి 60 ఏళ్లలోపు వయసు కలి గిన వారు ఈ రుణాలు పొందడానికి అర్హులని పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీ లోపు ఎపిఒబిఎంఎం ఎస్ ఎపిసిఎఫ్ వెబ్‌సైట్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అర్హులైన బిసిలు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం 8 నుంచి 11వ తేదీ వరకు ఎంపిడిఒ కార్యాలయంలో ఇంటర్వ్యూలను నిర్వహించి అర్హులైన వారికి స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు.

అసత్య ఆరోపణలు చేస్తే సహించం

ప్రజాశక్తి-పీలేరు

ఎన్ఎస్‌యుఐపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమృత్‌తేజ పేర్కొన్నారు. శనివారం పీలేరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ జనవరి 27న ఎన్ఎస్‌యుఐ పేరు చెప్పుకుని పుంగనూరు నియోజకవర్గంలోని కొన్ని విద్యాసంస్థల్లోకి వెళ్లి వారిని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎన్ఎస్‌యుఐకి చెడ్డ పేరు తెచ్చే విధంగా ఏ వ్యక్తులైన విద్యా సంస్థల దగ్గరికి వెళ్లి బెదిరించే ధోరణితో వ్యవహరిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉన్నత స్థాయికి ఎదగడం గర్వకారణం

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటీలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగడం గర్వకారణమని వైస్ ఛాన్సలర్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీలో 2008 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగే కార్యక్రమంలో మొదటిరోజు ఆర్కే వ్యాలీలోని కంప్యూటర్ సెంటర్ దగ్గర మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఆర్జీ యూకేటీ వైస్ ఛాన్స్‌లర్ విజయ్‌కుమార్, రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్ సంద్ర, డైరెక్టర్లు ఎవిఎస్ కుమారస్వామి గుప్తా, ప్రొఫెసర్ భాస్కర్ పటేల్, బాలాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా విసి, రిజిస్ట్రార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రతిభావంతులైన విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించడానికి ఆర్జీయూకేటీని 2008లో స్థాపించారన్నారు. ఆ బ్యాచ్ విద్యార్థులు బీటెక్ పూర్తి చేసుకుని పదేళ్లయిన సందర్భంగా దాదాపు 200 మంది విద్యార్థులతో సమ్మేళనం నిర్వహించడం సంతోషకరమన్నారు. పూర్వపు విద్యార్థులు తమ గత అనుభవాలను ఒకరికొకరు పంచుకున్నారు. ముందుగా తమకు బోధించిన ఆర్కే వ్యాలీ క్యాంపస్ ఉపాధ్యాయ సంఘానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చివరగా ఆర్కేవ్యాలీ లలిత కళా విభాగం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలతో తొలిరోజు ముగిసింది. కార్యక్రమంలో ఆర్జీయూకేటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బండి ప్రసాద్, పరిపాలన అధికారి పి.రవికుమార్, అకడమిక్ డీన్స్ రమేష్ కైలాస్, రూపస్ కుమార్, పూర్వపు విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఎండి రఫీ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు చెల్లించకపోతే పరీక్ష రాయనివ్వం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఫీజు చెల్లించకపోతే పరీక్ష రాయనివ్వమని కళాశాల యాజమాన్యం అభ్యంతరం వ్యక్తం చేయడంతో ప్రొద్దుటూరు హనుమాన్ నగర్‌కు చెందిన పేద విద్యార్థి ప్రసన్న ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఆ మేరకు శనివారం ప్రొద్దుటూరు మండల్ లీగల్ సర్వీస్ అథారిటీకి ప్రసన్న ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. శ్రీ లక్ష్మివెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కళాశాలలో ప్రసన్న ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ప్రభుత్వం మంజూరు చేసే ఉపకార వేతనం ద్వాడా ఆమెకు కళాశాలలో సీటు వచ్చింది. కళాశాలకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. సోమవారం ప్రసన్న పరీక్ష రాయాల్సి ఉంది. కళాశాల ఫీజు కడితేనే పరీక్ష రాసేందుకు హాల్‌టికెట్ ఇస్తాం లేదంటే ఇవ్వం అని కళాశాల ప్రిన్సిపల్ (సెల్-9441155946) అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు ప్రసన్న వాపోయింది. మొదటి సంవత్సరం కూడా ఇలాగే ఇబ్బంది పెడుతుంటే అప్పుచేసి రూ.56వేలు ఫీజు చెల్లించామని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రసన్నకు ప్రభుత్వం ఉపకారవేతనం చెల్లిస్తున్నందు వల్ల ఎలాంటి ఫీజ్ చెల్లించాల్సిన అవసరం లేదని కళాశాల యాజమాన్యం చెప్పినందువల్లే తాను కళాశాలలో చేరానని అంటోంది. ఇప్పుడు యాజమాన్యం మాటమార్చి ఫీజ్ కడితనే.. లేకుంటే హాల్‌టికెట్ ఇచ్చేదిలేదని, పరీక్ష రాయలేవని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. పేదరికంలో ఉన్నా.. మొదటి సంవత్సరం చేసిన అప్పు ఇప్పటి వరకూ తీర్చలేదని కన్నీటిపర్యంతమైంది. తన చదువుకు ఆటంకం కలుగకుండా పరీక్ష రాసేందుకు అవకాశం ఇవ్వాలని ప్రసన్న అధికారులను కోరుతోంది.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంపొందించుకోవాలి : సర్పంచ్

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

ఆర్థిక అక్షరాస్యత పట్ల ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని అన్నలూరు సర్పంచ్ ఎం.శ్రీనివాసులరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక గ్రామ సచివాలయంలో రిజర్వ్ బ్యాంకు వారి సౌజన్యంతో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ రైతులు, పొదుపు సంఘాల మహిళలు, సైబర్ క్రైమ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గ్రామ సచివాలయ కార్యదర్శి టి.వెంకటసుబ్బయ్య మా ట్లాడుతూ బ్యాంకు లావాదేవీలు, పొదుపు నిర్వహణ జాగ్రత్తలపై ఈ కార్యక్రమం చాలా ఉపయోగంగా ఉంద న్నారు. రిటైర్డ్ ఎపిజిబి మేనేజర్ కృష్ణారెడ్డి సైబర్ క్రైమ్స్, బ్యాంకు లావాదేవీల గురిం చి వివరించారు. కార్యక్రమంలో కెవిఎస్ రూరల్ మీడియా కళాజాత బృందం కళా ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్ర మంలో ప్రోగ్రాం కో ఆర్డి నేటర్ ఉదయ్ కుమార్ సచివాలయ సిబ్బంది. గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులు విక్రయించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు : వ్యవసాయ శాఖ అనుమతి పొందిన నాణ్యమైన ఉత్పత్తులు మాత్రమే రైతులకు విక్రయించాలని ఎఒ వెంకటకృష్ణారెడ్డి డీలర్లకు సూచించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను శనివారం ఎఒ తనిఖీలు నిర్వహించారు. రిజిస్టర్లు, లైసెన్స్, స్టాక్ నిల్వలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి పొందిన ఫారం ఒ ఉత్పత్తులు మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. లైసెన్స్ ప్రదర్శించి స్టాక్‌బోర్డ్, ధరల పట్టిక కనపడేలా ఉంచాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఉత్పత్తులకు నగదు బిల్లు ఇవ్వాలని సూచించారు. నమూనాలు సేకరించి నాణ్యత ప్రమాణాల నిమిత్తం ప్రయోగ శాలకు పంపామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నాణ్యత ప్రమాణాలు లేకుంటే అలాంటి అమ్మకాలను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం నిబంధనలు అనుసరించి వ్యాపార లావాదేవీలు కొనసాగించాలన్నారు.